

వైన్‌షాపు దరఖాస్తులను పరిశీలించిన ఎక్సైజ్ డీసీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అర్బన్ ఎక్సైజ్ కార్యాలయంలో వైన్‌షాపుల లైసెన్స్‌ల కోసం స్వీకరిస్తున్న దరఖాస్తు కౌంటర్లను కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) అంజన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, రశీదులు, ఎంట్రీపాస్‌లు జారీ తదితర అంశాలపై డీసీ కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. హుజూరాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని మొలంగూర్ మద్యం దుకాణానికి దరఖాస్తులను స్వయంగా డీసీ అంజన్‌రావు స్వీకరించి దానికి సంబంధించి ఎంట్రీపాస్‌ను దరఖాస్తుదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) పి శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపులకు లైసెన్స్‌ల కోసం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేయగా ఇప్పటి వరకు 38 షాపులకు 77 దరఖాస్తులు వచ్చాయని ఈఎస్ తెలిపారు. శుక్రవారం 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● శుక్రవారం సభలో కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మనం పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పోషణ మాసంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోతిరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సభ, విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంపై అవగాహన పెంచుకొని వంట చేయాలని మహిళలకు సూచించారు. మనం తినే ఆహారం ద్వారా అందే పోషకాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. అన్నం తక్కువ, కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. లింగ వివక్ష చూపకుండా పిల్లలకు ఇంటి పనులు, వంట పనులతో పాటు ఆరోగ్యకర ఆహారం తయారు చేసే విధానం నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా ఐరన్, కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐరన్, కాల్షియం మాత్రలు ఉచితంగా ఇస్తారని, 30 ఏళ్లు దాటిన మహిళలు ఆరునెలలకొకసారి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటూ అవసరమైన మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులకు నేను సైతం ఎన్జీవో ఆధ్వర్యంలో బహుమతులను అందించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పాలనను, జిల్లాలో ప్రవేశపెట్టిన కార్యక్రమాలను వివరిస్తూ పాఠశాల హెచ్ఎం ఆలపించిన పాట అందరిని ఆకట్టుకు న్నది.


విద్యార్థులు తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

(మిగతా 8వ పేజీలో)

సైదాపూర్‌లో కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన


సైదాపూర్‌లో ఎస్టీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న హుజూరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

సైదాపూర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో కోర్టు ఏర్పాటు చేసేందుకు పలు ప్రభుత్వ భవనాలను హుజూరాబాద్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. సైదాపూర్‌లోని ఎస్టీ హాస్టల్, తహసీల్దార్ కార్యాలయం వద్ద గల పాత ఎమ్మార్వో ఆఫీస్ భవనా లను పరిశీలించారు. కోర్టు ఏర్పాటుకు స్థానికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సైదాపూర్‌లో కోర్టు ఏర్పాటు చేసేందుకు హైకోర్ట్ ఆదేశాల మేరకు రెండు భవనాలు పరిశించామని నివేదికను హైకోర్ట్‌కు అందజేస్తామన్నారు. సైదాపూర్ లో కోర్టు ఏర్పాటు చేయడంతో కేసుల సత్వర పరిష్కారానికి దోహ దం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, న్యాయవాదులు అందె వెంకటేశ్వర్ రావు, కామని స మ్మయ్య, మట్టెల తిరుపతి, బీంరావ్, హరిహరణ్, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండారపు శ్రీనివాస్, ములుపాల రవీందర్, మిట్టపెల్లి కిష్టయ్య, లంకదాసరి మల్లయ్య, గడ్డం శేకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవంపల్లి గురుకుల పాఠశాలలో ఎంపీడీవో విచారణ


దేవంపల్లి గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మానకొండూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎంపీడీవో వరలక్ష్మీ విచారణ చేపట్టారు. గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదులు, కిచెన్‌లో పరిశుభ్రత పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల పిర్యాదుతో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే విచారణకు ఆదేశించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ విచారణలో వంటగది, మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకును పరిశీలించినట్లు తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రావు, ఆర్ఐ అశోక్ ఉన్నారు.

హుజూరాబాద్‌లో బీజేపీ నాయకులను గెలిపించుకుంటా

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గానికి తనకు 25ఏళ్ల అనుబంధం ఉందని.. నేను కొత్తగా రాలేదని, ఇక్కడి బీజేపీ అభ్యర్థులను ఎంపిక చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

హుజూరాబాద్‌లో బీజేపీలోకి వచ్చిన తర్వాత మొదటిసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరు గుతున్నాయని, అందరిని గెలిపిం చుకు నే బాధ్యత తనదన్నారు. నాకు పదవుల కంటే ప్రజలు ముఖ్యమని, ఆపదలో ఉన్న వ్పుడు ప్రజలకు అండగా ఉంటానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ రిజర్వేష న్లపై రాజ్యాం గ నిపుణులు ముందే చెప్పినా పట్టించుకోకుండా ఎన్నికల నోటి ఫికేషన్ ఇప్పించారన్నారు. తెలంగాణలో 85 శాతం బడుగు బలహీన వర్గాల వారు ఉన్నారని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ మొదటి నుంచి పోరాడు తుంద న్నారు. ఈ బిల్లుపై అసెంబ్లీలో బీజేపీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపిందన్నారు. 50ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాం గ్రెస్ పార్టీ రిజర్వేషన్ల విషయంలో మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. చేసిన తప్పునకు కాంగ్రెస్ పార్టీ చెంపలు వేసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పి, ఎన్నికలు జరిపించాలన్నా రు. గతంలో పనిచేసిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు, జడ్పీ టీసీలు, ఎంపీటీసీలకు ఇప్పటి వరకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నార న్నారు. గత సంవత్సరం యా సంగిలో కొనుగోలు చేసిన సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ ఇప్పటి వరకు ఇవ్వలేద న్నారు. కేంద్రలో 27శాతం బీసీ మంత్రులు ఉన్న ఏకైక ప్రభుత్వం మోదీద న్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, డాక్టర్ కాళి ప్రసాద్, జన్నపురెడ్డి సురేం దర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్, జ్యోత్స్న, సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం
● జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ 7
● ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన
ఏసీబీకి పట్టుబడిన కార్యదర్శి
● ఇందిరమ్మ ఇంటి బిల్లు మంజూరుకు లంచం డిమాండ్ 6

జీఎస్‌టీ సంస్కరణల అమలుకు సహకరించండి

కరీంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):జీఎస్‌టీ సంస్కరణలు పేద మధ్య తరగతి ప్రజలకు ఒక వరం లాంటివని కేంద్రీయ వస్తు సేవల పన్నుల (సిజిఎస్‌టి)శాఖ కరీంనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ కె.బాల సైదయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ ఐసీ ఏజెంట్ల సంఘ భవనంలో వస్తు సేవల పన్ను అమలుకు సంబంధించి పన్ను చెల్లింపుదారులు, ఆడిటర్లు, వాణిజ్య, వినియోగ దారుల సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన అవగాహన సమా వేశంలో మాట్లాడారు. జీఎస్‌టీ సంస్కరణలు వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తాయని, రిటైల్ ధరలు తగ్గి వినియోగం బలపడు తుందని అన్నారు. ఇటీవల జరిగిన 56వ జీఎస్‌టి కౌన్సిల్ సమావేశం వస్తు సేవల పన్నుల్లో గణనీయమైన సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఐదు స్లాబులుగా ఉన్న వస్తు సేవల పన్నులు ప్రస్తుతం మూడు స్లాబులకు తగ్గిపోయాయని తెలిపారు. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్, సిమెంట్, వాహనాలు, ఆరోగ్యం, విద్య, చేతివృత్తుల ఉత్పత్తులపై పన్ను తగ్గడంతో నిత్యావసర వస్తువులు ప్రజలకు అందు బాటులోకి రావడానికి, ఆర్థిక వృద్ధికి ఊతం ఇవ్వడానికి దోహదపడతాయని అన్నారు. మార్పు చేసిన వస్తు సేవల పన్నుకు విరుద్ధంగా విక్రయాలు జరిగితే వినియోగ దారులు సంబంధిత వివరాలను తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. సమావేశంలో కేంద్రీయ వస్తు సేవల పన్నుశాఖ పర్యవేక్షకులు పిఎస్ ఎన్ బాబ్జీ, శిరీష్, గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల నిరసన

సుభాష్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఉద్యోగులకు ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ బాధ్యుడు టి రామా రావు డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో ప్రభుత్వ జనరల్ ఆసు పత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా సిబ్బందికి జీతాలు సకాలంలో అందడంలేద న్నారు.దాంతో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నా రని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి నెలా ఒకటవ తారీఖున జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూని యర్ ఎనలిస్టులు టి రవీందర్, ఎం ఏ అతీఖ్, ఫార్మసీ ఆఫీసర్స్ శేషగిరిధర్‌బాబు, ప్రసాద్, ఈసీజీ టెక్నీ షియన్ మనోహర్, ల్యాబ్ సిబ్బంది రాజేశం, ఎంఎన్‌వో షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆల స్యంగా వేతనాలు చెల్లిస్తోందని నిరసిస్తూ శుక్రవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట సిబ్బంది మౌనప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గేటు ఎదుట తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ప్రతి నెలా సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్వాతి, సులోచన, జ్యోతి, స్రవంతి, సుభాషిని, రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీవీవీపీ ఉద్యోగులు

బీసీలందరూ ఏకమై పోరాడాలి

గణేశ్‌నగర్,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై బీసీలు అందరూ ఏకమై పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్‌లో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం బీసీ సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి సంఘం కోర్టుకు వెళ్లడం దారుణమని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం కల్పిస్తే బీసీలు వ్యతిరేకించలేదన్నారు. 8శాతం లేని వాళ్లకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినా బీసీ సంఘాలు ఆందోళనలు చేయలేదన్నారు. 52శాతం పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో కల్పిస్తే కోర్టులో కేసు వేసి బీసీల నోట్లో మన్ను కొట్టారన్నారు. దీనిపై బీసీలందరూ ఒకటై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, విద్యార్థి సంఘం అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల అంజయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షులు మంతెన కిరణ్, బోయిని ప్రశాంత్, బియ్యం తిరుపతి, జీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ చౌక్ వద్ద రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

'కాంగ్రెస్ బాకీ కార్డు'తో ప్రజలను చైతన్యపరుస్తాం

● ఎప్పటి వరకు హామీలు తీరుస్తారో చెప్పండి
● సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే 'గంగుల' సూటి ప్రశ్న

కరీంనగర్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడంతో అన్ని వర్గాల ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష నుంచి లక్షన్నర రూపాయల బాకీ పడిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి ముఖ్య మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని చెప్పేందుకే బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ బాకీ కార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కాంగ్రెస్ బాకీ కార్డు ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ముందుగా కార్కానగడ్డ గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్ని కలకు ముందు ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీలు ఇచ్చి భరోసా కార్డుతో మభ్యపెట్టి అధికా రంలోకి వచ్చిందని, 22 నెలల కాంగ్రెస్ పాలనలో హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయక పోవడంతో వారిచ్చిన హామీ మేరకు ప్రజలకు ప్రభుత్వం బాకీ పడి, అప్పుల ప్రభు త్వంగా మారిందని, రేవంత్ సర్కార్ సిబిల్ స్కోర్ పడిపోయిందని విమర్శించారు. ప్రజలకు ఇవ్వాల్సిన బాకీలను ఎప్పటి వరకు ఇస్తారో సీఎం రేవంత్‌రెడ్డి గడువు చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బకాయి ఉన్నందున ఆయన ఇంటి ముందు డప్పు కొట్టి నిరసన తెలుపాలని ప్రజల ను చైతన్యపరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చాక ఆడబిడ్డలకు నెలకు 2,500 చొప్పున ఇస్తామని 55వేల బకాయి పడిందని, స్కూటీలు ఇవ్వలే దని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్దిదారులకు తులం బంగారం బాకీ ఉందని, వృద్ధు లు, వితంతువులు, వికలాంగుల పెన్షన్లను రెట్టింపు చేస్తామన్నందున ఒక్కొక్కరికి 44 వేల నుంచి 66 వేల వరకు బకాయి పడిందని అన్నారు. రైతులకు 76 వేలు ఇలా వారిచ్చిన హామీ లను అమలు చేస్తే ఒక్కో వ్యక్తికి ప్రభుత్వం ఇప్పటికే లక్ష నుంచి లక్షన్నర రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, సంవత్స రానికి 20వేల కోట్ల చొప్పున రెండేళ్లలో ఇస్తామన్న 40వేల కోట్లను ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అనంతరం ఇంటింటికి తిరు గుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీ ఛైర్మన్ జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్య క్షుడు చల్ల హరిశంకర్, పలువురు మాజీ కార్పొ రేటర్లు, డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు



గాంధీ విగ్రహం దగ్గర నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సెంటినరీకాలనీలో యువకుడి దారుణ హత్య


చిరంజీవి(ఫైల్)

రామగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ నడిబొడ్డున శుక్రవారం పట్ట పగలు యువకుడు దారుణహత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. సెంటినరీకాలనీ సీటూ200 క్వార్టర్‌లో మహిళాసమైఖ్య కార్యాలయం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం న్యూమారేడుపాక పోతనకాలనీకి చెందిన కోట చిరంజీవి(36) మహిళా సమైఖ్య కార్యాలయాని(ఐకేపీ)కి వచ్చాడు. కార్యాలయం సమీపంలో కాపు కాసుకొని ఉన్న నల్గురు వ్యక్తులు కార్యాలయంలో ఉన్న చిరంజీవిని బయటకు లాగి కత్తులతో పొడిచి, రాడ్లతో దాడి చేయగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు కోట చిరంజీవి పోతనకాలనీలో మీ సేవా సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. చిరంజీవి భార్య 2019లో మృతిచెందింది. పెంచికల్‌పేట్ గ్రామానికిచెందిన మహిళ, చిరంజీవి క్లాస్ మెట్లు. పోతనకాలనీలో మీ సేవాకేంద్రాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కంప్యూటర్ నేర్చుకోవడానికి మహిళ చిరంజీవి వద్దకు వెళ్లేది. వీరి పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను, భర్తను వదిలి వస్తానని, పెళ్లి చేసుకోవాలని కోరింది. వద్దు నా పరువు పోతుందని చిరంజీవి వారించేవాడు. అయినా ఆమెతీరు మార్చుకోకుండా ఈవిషయం మాట్లాడేందుకు డీఆర్డీఏ(ఐకెపి) కార్యాలయానికి రావాలని హత్యకు ప్లాన్‌వేసింది. సెంటినరీకాలనీ వెళ్లిన చిరంజీవిని ఆమెభర్త కుమార్, అన్న అనవేననరేష్, తండ్రి అనవేన మల్లయ్య, బంధువు పిడుగు చందు.. కోట చిరంజీవిపై మారణాయుధాలతో కొట్టి హతమార్చారు. మృతుడి తమ్ముడు కోటా రామ్‌చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఘటన స్థలాన్ని ఏసిపి మడత రమేశ్, మంథనిసీఐ రాజు, ఎస్ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పక్క ప్రణాళిక ప్రకారం హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణ వెల్లడైయ్యింది. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జూలపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బట్టు సురేష్ (40) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్‌కు పదేళ్లక్రితం వివాహమైంది. భార్య భర్తల మధ్య వివాదంతో ఏడేళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చిన సురేష్ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. సురేష్‌కు సమీప బంధువు లక్ష్మణ్‌తో కొంత కాలంగా భూవివాదం నడుస్తోంది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సురేష్‌పై కేసు నమోదైంది. దీంతో మానసికంగా కుంగిపోయి ఆందోళనకు గురైన సురేష్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

భర్త జైలులో.. దిగులుతో భార్య బలవన్మరణం


అన్వరీభేగం(ఫైల్)

మల్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా భర్త జైలులో ఉండడంతో పాటు ఒంటరితనం, ఆర్థిక సమస్యలతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో ఉండే అన్వరీబేగం(37) భర్త అబ్దుల్ రషీద్ కొన్నిరోజులుగా జైలులో ఉంటున్నాడు. దీంతో అన్వరీబేగం తరచూ దిగులు పడుతుండేది. అలాగే ఒంటరితనంతోపాటు ఆర్థికసమస్యలు వెంటాడుతుండడంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె గురువారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. వెంటనే ఆమె కుమారుడు అఖిల్ చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అక్కడ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌తోపాటు ప్రయాణికురాలు గాయపడింది.

ధ్వంసమవుతున్న గుట్టలు



- గుట్ట పై ఉన్న నందీశ్వరుడు, పాదాలు
- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ క్వారీ

ఓదెల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి అందాలు, నీటి ఊటలు, వందేళ్ల చరిత్ర ఉన్న కొమిర, ఓదెల గుట్టలు ధ్వంసమవుతున్నాయి. చారిత్రాత్మక శిల్పాలు, విగ్రహాలు, గుహలు, కట్టడాలు ఉన్న చోట గ్రానైట్ క్వారీలకు లీజుకు ఇవ్వవద్దనే నిబంధన ఉంది. అయినప్పటికీ ఓదెల, కొమిర గుట్టలను లీజుకు ఇస్తుండడంతో పర్యావరణంతో పాటు విగ్రహాలు, గుహలు దెబ్బ తింటున్నాయి. కొమిర గుట్టపై వందేళ్ల క్రితం నుంచి ఉంటున్న నందీశ్వరుని విగ్రహంతోపాటు రాముని పాదాలు క్వారీల వల్ల, గుర్తుతెలియని వ్యక్తుల వల్ల ధ్వంసమయ్యాయి. ఇదే గుట్టకు కింది భాగంలో ఉన్న చిన్నయ్య, పెద్దయ్య గుహ కూడా గ్రానైట్ క్వారీ వల్ల క్రమక్రమంగా ధ్వంస మవుతోంది.

చిన్నయ్య పెద్దయ్య గుట్ట..

వందేళ్ల క్రితం నుంచే చిన్నయ్య, పెద్దయ్య గుట్టగా


చిన్నయ్య పెద్దయ్య గుహ వద్ద భక్తుల పూజలు

పేరొందిన కొమిర గుట్ట అలరారు తోంది. అలాగే నీటి ఊటలతో, గుహలతో ఓదెల గుట్టకు చారిత్రాత్మకమైన ఉదంతం ఉంది. నాడు కరువుతో తల్లడిల్లుతున్న సమ యంలో కొమిరకు చెందిన చిన్నయ్య, పెద్దయ్య ప్రజలకు నిలువ నీడను కల్పించడానికి గుట్టపై మొక్కల పెంపకాన్ని చేపట్టి, తాగునీటి కోసం గుహలు ఉపయోగించారని, ఫలాలతో గుట్ట ఆకలి దప్పికను తీర్చినట్లు చెబుతారు. గుట్టవద్ద యేటా చిన్నయ్య, పెద్దయ్య జాతర, వంటవార్పు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఓదెల, కొమిర, చిన్న కొమిర గ్రామాల ప్రజలు యేటా శ్రావణ మాసం ముందు చిన్నయ్య, పెద్దయ్య గుహకు చేరుకుంటారు. ముందుగా గుట్టలపై ఉన్న నందీశ్వరుడు, రాముని పాదాలను దర్శించుకొంటారు.

కనుమరుగవుతున్న గుట్టలు

నిబంధనలను తుంగలో తొక్కుతున్న సంబంధిత శాఖ అధికారుల తప్పిదాల వల్ల గుట్టలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు గుట్టలు క్వారీ పేరుతో 10శాతం మేరకు ధ్వంసమయ్యాయి. దీంతో గుట్టల్లో ఉన్న నెమళ్లు, కుందేళ్లు, పక్షులు, తదితర వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు గుట్టలను లీజుకు ఇవ్వడం వల్ల ప్రజల విశ్వాసాలు దెబ్బతింటున్నాయి.

ఒక గుట్టకు మాత్రమే అనుమతి ఇచ్చాం
మైనింగ్ ఏడీ శ్రీనివాస్



చారిత్రాత్మకమైన గుట్ట ప్రాంతానికి గ్రానైట్ క్వారీ 200 మీటర్ల దూరం ఉండాలి. కేవలం ఓదెల గుట్టకు పది హెక్టార్లు (25 ఎకరాలు) మాత్రమే గ్రానైట్ క్వారీకి 20 ఏండ్లు అనుమతి ఇచ్చాం. కొమిర గుట్టకు ఎలాంటి అనుమతి లేదు. ఓదెల గుట్టకున్న ఊట గుహల ధ్వంసంపై పరిశీలిస్తాం. ప్రస్తుతం క్వారీ నిలిచిపోయింది. కొమిర గుట్టపై గ్రానైట్ క్వారీ అక్రమంగా కొనసాగితే చర్యలు తీసుకుంటాం.

చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు..
బోగే సదానందం సామాజిక కార్యకర్త, ఓదెల



క్వారీల కోసం ఓదెల కొమిర గుట్టలను గ్రానైట్ క్వారీకి లీజుకు ఇవ్వడంతో గుట్టపై ఉన్న చారిత్రాత్మక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. అధికారులు అనుమతులు రద్దుచేసి చిన్నయ్య పెద్దయ్య జాతరను నందీశ్వర విగ్రహం పాదముద్రికలను కాపాడాలి. కొందరు ప్రభుత్వానికి పన్నులు ఎగవేసి క్వారీలను నడుపుతున్నారు.

రెస్టారెంట్ సిబ్బందిపై దాడి..

- కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. శుక్రవారం దీనిపై హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. గురువారం రాత్రి రెస్టారెంట్ మూసివేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భోజనానికి వచ్చారు. రెస్టారెంట్ మూసివేస్తామని తొందరగా వెళ్లాలని సిబ్బంది సూచించారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న సదరువ్యక్తులు ఆగ్రహానికి గురై సిబ్బందిపై దాడిచేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వారు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సదరువ్యక్తులు హుజూరాబాద్‌లోని పాతవాడకుచెందిన వారిగా గుర్తించారు.

పెన్షన్ ఇప్పిస్తానని.. పుస్తెలతాడు చోరీ


బాధితురాలు శంకరమ్మ

ధర్మారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నీకు పెన్షన్ మంజూరైంది, ఫొటో దిగితే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇప్పిస్తా అని ఓ వ్యక్తి వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బుదారపు శంకరమ్మ(70) శుక్రవారం కూరగాయలు తేవడానికి వెళ్తుండగా ఆమెకు ఎదురుగా వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి శంకరమ్మకు దండం పెట్టాడు. నేను మీ గ్రామ కార్యదర్శిని అని పరిచయం చేసుకొని మాటల్లో దింపాడు. నేను మీ ఇంటికి వెళ్లి వస్తున్నాను, నీకు వస్తున్న రెండు వేల పెన్షన్ నాలుగు వేలు అయ్యిందని నమ్మబలికాడు. నా వెంట వచ్చి ఫొటో దిగితే నీకు పెన్షన్ డబ్బులు ఇస్తానని చెప్పి గాయత్రి బ్యాంకు ఎదురుగా ఉన్న సందులోకి తీసుకెళ్లి అక్కడే ఉన్న ఓ బెంచ్‌పై కూర్చోబెట్టాడు. ఫొటో తీస్తున్న క్రమంలో పుస్తెల తాడు ఉంటే పెన్షన్ రాదని, ఈ ఫొటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపాలని చెప్పాడు. దీంతో ఆ మహిళ మెడలో నుంచి మూడు తులాల పుస్తెల తాడు అతని చేతిలో పెట్టగా డబ్బులు తెస్తానంటూ జారుకున్నాడు. ఎంతసేపటికీ మనిషి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సదరు మహిళ లబోదిబోమంది. శంకరమ్మ ఫిర్యాదుతో పోలీసులు చౌరస్తాలోని ఓ మొబైల్ షాప్‌లో సీసీ కెమెరాను పరిశీలించగా శంకరమ్మతో మాట్లాతున్న ఆవ్యక్తి దృశ్యాలు రికార్డయ్యాయి. జరిగిన సంఘటన ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మాజీ ఎంపీపీ

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలుక పెంటయ్య తన నిజాయితీని చాటుకున్నారు. గతసెప్టెంబరు 14వతేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌పే ద్వారా రూ.49850 జమయ్యాయి. ఆ డబ్బులు నగదును తీసుకెళ్లి చందుర్తి ఎస్ఐ రమేష్‌కు శుక్రవారం పెంటయ్య అప్పగించారు. ఆయనవెంట మాజీకోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా పెంటయ్యను, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

శంకరపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామశివారులో హైకోర్టు ఆర్డర్ మేరకు841,842 సర్వేనంబర్‌లను సర్వేచేయడానికి వచ్చిన ప్రభుత్వ సర్వేయర్‌ను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. సర్వే చేయించుకునే వ్యక్తికి రైతులమధ్యవాగ్వాదం చోటుచేసుకుంది. సదరువ్యక్తులు పోలీసులు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి తహసీల్దార్ సురేఖ, పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడారు. హైకోర్టు ఆర్డర్ మేరకు సర్వేయర్ సర్వే నంబర్ కేటాయించడానికి వచ్చినట్లు తహసీల్దార్ సదరు రైతులకు వివరించారు. సాయంత్రం కావడంతో సర్వేచేయకుండా తహసీల్దార్, సర్వేయర్ అక్కడినుంచి వెళ్లిపోయారు.

యువతిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్‌చేసిన వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన చలేంద్ర వేణు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పోలే ప్రశాంత్ అనే యువకుడు నుంచి ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను తీసుకున్నాడు. సదరు యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫేక్ ఐడీని క్రియేట్ చేసి నిందితుడు మెసేజ్‌లు చేస్తూ రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ఆమె వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు యువతి షీ టీం పోలీసులను సంప్రదించింది. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా శుక్రవారం వేణును పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత తమ వ్యక్తిగత ఫొటోలను ఎవరికి ఇవ్వవద్దని, సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట చందుర్తి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

బాల నేరస్థుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో దొంగతనాల కేసుల్లో వరంగల్ జువైనల్ హోంకు వెళ్లి వచ్చిన కరీంనగర్‌కు చెందిన బాల నేరస్థుడిని కరీంనగర్‌రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కరీంనగర్‌రూరల్ మండలం, ఎల్ఎండీ, కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో పలు ఫంక్షన్‌హాళ్లలోని డ్రెస్సింగ్‌రూంలలో చొరబడి బంగారు ఆభరణాలు చోరీ చేశాడని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈనెల8న కూడా ఒక ఫంక్షన్‌హాల్ డ్రెస్సింగ్‌రూంలో చొరబడి 4గ్రాముల బంగారు కమ్మలను చోరీచేశాడని, ఆ బంగారాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశామని సీఐ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చిప్స్ షాపులో మంటలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌వద్ద ఉన్న ఓచిప్స్ షాప్‌లో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దుకాణం బంద్ చేసిన తరువాత షార్ట్‌సర్క్యూట్ జరిగి అందులో ఉన్న తినుబండారాలు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఆస్తనష్టం జరిగినట్లుతెలుస్తోంది.

పేకాటరాయుళ్ల పట్టివేత

కోరుట్ల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపేట గ్రామ శివారులో పేకాట అడుతున్న ఆరుగురిని జిల్లా సీసీఎస్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. వారివద్ద రూ. 4,460 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి

- ఇందిరమ్మ ఇంటి బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- పదివేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు


ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి అనిల్

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరమండలం మధురానగర్ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధురానగర్ గ్రామపరిధిలోని పత్తికుంటపల్లికి చెందిన గంగాధర లాస్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటిపనులు బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగానే మొదటిబిల్లు లక్ష నెలరోజులక్రితం ఆమె ఖాతాలో జమైంది. బిల్లు వచ్చినప్పటినుంచి గ్రామకార్యదర్శి అనిల్ పదివేలు ఇందిరమ్మ ఇంటిబిల్లు కోసం ఖర్చులకు ఇవ్వాలని వేధిస్తున్నాడు. రెండుమూడు మార్లు పైసల కోసం ఇంటికి సైతం వెళ్లాడు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి లంచం ఇవ్వలేనంటూ లబ్ధిదారురాలి భర్త శ్రీకాంత్ కార్యదర్శికి తెగేసి చెప్పాడు. అయినా కార్యదర్శి లంచం కోసం వేధిస్తుండటంతో శ్రీకాంత్ కరీంనగర్‌లోని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌ను సంప్రదించాడు. ప్రణాళిక ప్రకారం శుక్రవారం గ్రామపంచాయతీలో కార్యదర్శి అనిల్ పదివేలను గంగాధర శ్రీకాంత్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గ్రామ రికార్డులను పరిశీలించి, సదరు అవినీతి కార్యదర్శిని ఏసీబీకోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా పనుల నిమిత్తం డబ్బులు ఇవ్వాలని అడిగినట్లయితే టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

- చెట్టును ఢీకొన్న కారు
- బోల్తా పడిన ప్యాసింజర్ ఆటో
- నలుగురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు


చెట్టును ఢీకొన్న కారులో గాయాలతో యువకులు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మధ్యలోని జాతీయరహదారిపై గురువారం అర్ధరాత్రి గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు స్నేహితులు టీఎస్05ఈజే 4214నంబర్‌గల కారులో టీతాగడానికి మండలంలోని మారుతీనగర్ శివారులోని హోటల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు రహదారికి పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. అందులో ఉన్న అవేస్, ఫయాజ్, మౌలానా ఆమెర్, సమీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మరో ముగ్గురు సైఫ్, ఫుర్ఖాన్, కైఫ్‌లకు స్వల్ప గాయాలుకావడంతో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మారుతీనగర్ శివారులోని పెద్దగుండువద్ద కారు, టాటా మ్యాజిక్ ప్యాసింజర్ ఆటోలు ఢీకొనంగా అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ఒకే వాహనంపై 277 పెండింగ్ చలాన్లు

- మొత్తం విలువ రూ.79,845



పెండింగ్ చలాన్లు ఉన్న వాహనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలకు పైగా 277 పెండింగ్ ట్రాఫిక్‌చలాన్లు పేరుకుపోయిన మోటార్ సైకిల్‌ను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని సిక్కువాడీ ప్రాంతంలో సాధారణ ట్రాఫిక్ నియంత్రణ, పెట్రోలింగ్‌విధుల్లో ఉన్న ఇన్స్‌పెక్టర్ పి రమేష్, ట్రాఫిక్-2, కానిస్టేబుల్ జి శ్రీనివాస్‌రావు బృందంతనిఖీల్లో హీరో యూనికార్న్ మోటార్ సైకిల్ టిఎస్ 02ఇఎక్స్ 1395 నెంబర్ గల వాహనాన్ని పట్టుకున్నారు. 2019 సంవత్సరం జూన్ 8వ తేదీ నుంచి డిసెంబర్ 25 2024 మధ్య కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో 277పెండింగ్ చలాన్లతో 79,845రూపాయల ఫైన్ ఉన్నది. వాహనం నడుపుతున్న వ్యక్తి కరీంనగర్‌లోని గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్(37) ఆర్ఎంపీ ప్రాక్టిషనర్‌గా గుర్తించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 264 చలాన్లు

మొత్తం 277 చలాన్లలో ఎక్కువ భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పిఎస్ పరిధిలో 264 నమోదయ్యాయి. 277 చలాన్లలో 254 హెల్మెట్ లేకుండా, ఫేస్ మాస్క్ ధరించకపోవడం 10, ట్రిపుల్ రైడింగ్ 7, సెల్‌ఫోన్ రైడింగ్ 2, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకెళ్లకపోవడం 2, నంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం 1, జిగ్‌జాగ్ డ్రైవింగ్ 1 నమోదయ్యాయి.

చలాన్ల వసూలుకు చట్ట పరమైన చర్యలు
- యాదగిరిస్వామి, అసిస్టెంట్ పోలీస్‌కమిషనర్ (ట్రాఫిక్)

వాహనంపై నమోదైన చలాన్లు రూ.79,845లు వసూలు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌నియమాల ఉల్లంఘనపై వాహనదారులు చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తాం. వాహనం స్వాధీనం చేసుకున్నాం. వాహనయజమానులు పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను వెంటనే క్లియర్ చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీవద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతిచెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండల కేంద్రానికి చెందిన ఇప్పలపల్లి రవళిక(23), దీకొండ వెంకటసాయి హైదారాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం ఇద్దరు కలిసి హైదారాబాద్ నుంచి గంగాధరకు వారి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. అతివేగంగా ఉన్న బైక్ అదుపు తప్పి ఎల్ఎండీ కాలనీవద్ద రవళిక రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని పోయిందని దీంతో ప్రమాదం జరిగిందని బైక్ నడుపుతున్న వెంకటసాయి పోలీసులకు తెలిపాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.


ఘటన స్థలంలో మృతిచెందిన రవళిక

మెటాఫండ్ ప్రో యాప్ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో, మెటాఫండ్ ప్రో యాప్ కేసులో జగిత్యాల పట్టణానికి చెందిన కస్తూరి రాకేష్, కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, వీరబత్తిని రాజును అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపి నిందితులు మెటాఫండ్ ప్రో అనే యాప్‌లో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే మూడు లక్షల రూపాయలు వస్తాయని ఆశచూపి గొలుసుకట్టు గొలుసు కట్టు వ్యాపారం చేశారన్నారు. కొడిమ్యాల మండలానికి చెందిన ముగ్గురి నుంచి 20 లక్షల రూపాయలు వసూలు చేశారని అన్నారు. పెట్టిన డబ్బుకు మూడు వంతులు వస్తుందని ఆశ చూపడంతో పాటు సింగపూర్, దుబాయ్ లాంటి దేశాలకు తీసుకెళ్తామని ఆశ చూపారని ఎస్పీ తెలిపారు. మెటా ఫండ్ మూసివేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 8వ తేదీన వీరబత్తిని రాజు, సింగిరెడ్డి తిరుపతి రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా శుక్రవారం కస్తూరి రాకేష్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డిఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- చెలరేగిన మంటలు..
- దగ్ధమైన కారు..

చిగురుమామిడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ శివారులో ఉన్న పెసరుపల్లిలో శుక్రవారం రాత్రి ఓకారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి కాలిపోయింది. ఏఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు జనగాం నుంచి ప్రశాంత్, సతీష్, నవీన్ అనేముగ్గురు యువకులు కొండగట్టు దైవదర్శనానికి కారులో బయలుదేరారు. ఈక్రమంలో పెసరుపల్లి శివారులో ఉన్న మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంటనే కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో యువకులు బయటపడ్డారు. అనంతరం కారులో మంటలుచెలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారు బెలూన్స్ ఓపెన్‌కాకపోతే ప్రాణనష్టం జరిగేదని, ఇతర ప్రయాణికులకు సైతం ఇబ్బంది ఉండేదని స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రాజన్న లడ్డూల తయారీలో నాణ్యత లోపం..

● లడ్డూల కౌంటర్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు



బూజుపట్టిన లడ్డూ ప్రసాదాన్ని చూపుతున్న నేతలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తయారు చేసే లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని బీజేపీ వేములవాడ పట్టణ నేతలు ఆరోపించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాదం కౌంటర్‌కు వెళ్లిన బీజేపీ నేతలు శ్రీధర్, శేఖర్, శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని భక్తులు నుంచి వచ్చిన ఫిర్యాదుతో రాజన్న ఆలయ ప్రసాదాల కౌంటర్‌కు వెళ్లి పరిశీలించామని, లడ్డూలు బూజు పట్టి దుర్వాసన వస్తున్నాయని గుర్తించినట్లు తెలిపారు. అంతే కాకుండా రాజన్న ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు సైతం లడ్డూ ప్రసాదం దుర్వాసన వచ్చిందని చెప్పిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ విషయంపై ఏఈవో స్పందిస్తూ రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా తయారీ కేంద్రం కూల్చివేశామని, అందులో భాగంగానే భక్తులకు లడ్డూలు తక్కువగా ఇవ్వకుండా ఉండేందుకు ఎక్కువగా తయారీ చేస్తున్నామని, రెండు రోజులుగా వర్షం కారణంగా లడ్డూ తేమ ఆరకపోవడంతో దుర్వాసన వచ్చి ఉండవచ్చని వివరణ ఇచ్చారు.

కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

ఆలయ ఈవో రమాదేవి

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యమైన లడ్డూలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నా మని, కావాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నా రని ఈవో రమాదేవి అన్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యతాలోపం, దుర్వాసనపై వచ్చిన ఆరోపణలపై ఆమె స్పందించారు. కొంత మంది ఉదయం నుంచి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారని, లడ్డూ ప్రసాదం దుర్వాసన వస్తోందని మీడియాకు ఫోన్ చేశారని తెలిసిందన్నారు. ఆలయ విస్తరణలో భాగంగా ప్రసాదాల తయారీ విభాగం వేరేచోట ఏర్పాటు చేశామన్నారు. లడ్డూలు నాణ్యత లోపించిందని తమ దృష్టికి రావడంతో వెంటనే విచారణ చేపట్టామన్నారు. పాత



కౌంటర్‌లో లడ్డులను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఆంధ్రబ్యాంకులో నిల్వ ఉన్న లడ్డూల పాత ట్రేలను ప్రసాదాల కౌంటర్ వద్ద ఏర్పాటు చేశామని, అట్టి ట్రేలు వాడకుండా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తున్నాయన్నారు. లడ్డూ ప్రసాదం దుర్వాసన రావడంపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేస్తున్నామన్నారు. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు విచారణ నిమిత్తం శాంపిల్ పంపించామని ఉన్నతాధికారులకు తెలియజేశామని వివరించారు.

లడ్డూ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆరా..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆల యంలో లడ్డూ ప్రసాదం నాణ్యత లోపం, దుర్వాసన వస్తుందన్న ఘటనపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని టెంపుల్ అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు లేఖ సిఫారసు చేసి విషయాలను, ఎక్కడ ఎటువంటి లోపం జరగలేదని, అయినా భక్తుల మనో భావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎటువంటి తప్పిదాలు జరగొద్దని, జాగ్రత్తగా ఉండాలని, ఆలయ ప్రతిష్ఠకు సంబం ధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం

మానకొండూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్‌జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడికరీంనగర్ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్‌జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికలకు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11,12వ తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ బాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కరుణాకర్‌రెడ్డి, జస్వీర్‌సింగ్, రాజేశ్ టీ షర్టులు పంపిణీ చేశారు.

ఎస్సారెస్పీకి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శుక్రవారం స్వల్పంగా పెరిగింది. 21 గేట్లు పైకి ఎత్తి 65,604 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా ఎల్‌ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2వేలు, మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 277క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతోంది. మోయ తుమ్మెదవాగు నుంచి 1077క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 1500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 198క్యూసెక్కులు మొత్తం 2775క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి మట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.818టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కలగానే మినీ స్టేడియం

నత్తనడకన కొనసాగుతున్న నిర్మాణ పనులు

విద్యార్థులు, క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు, యువతీయువకులు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో మంజూరు చేసిన మినీ స్టేడియం నిర్మాణ పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆధునిక వసతులతో మినీస్టేడియం అందుబాటులోకి రానుందని ఆశించిన విద్యార్థులు, క్రీడాకారులకు కలగానే మిగిలిపోతోంది. సాధన చేయడానికి అనువైన మైదానాలు, ఆట స్థలాలు, సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మినీస్టేడియం మంజూరై రెండేళ్లు గడుస్తున్నా- వినియోగంలోకి రాకపోవడం వల్ల క్రీడాకారులు, విద్యార్థులు అసౌకర్యాల నడుమ సాధన చేయాల్సి వస్తోంది. అరకొర వసతుల మధ్య శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే తాము మరింత నైపుణ్యంతో అంత ర్జాతీయ క్రీడల్లో రాణిస్తామని పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు..

మండలంలోని విద్యార్థులు, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మండల కేంద్రంలో మినీ స్టేడియనం నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు రూ.కోటి నిధులను కేటాయించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. మినీ స్టేడియంలో గ్యాలరీ, ఫ్లడ్ లైట్లు, ప్రహరీ గోడ, ఆర్చీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.43 లక్షలు ఖర్చు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరుకాకపోవడం వల్ల పనులను నిలిపివేశారు. యేడాదిగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల బిల్లు చెల్లించడంతో తిరిగి పనులను ప్రారంభించారు. గ్యాలరీ, ఆర్చీ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

స్థల వివాదం.. నిలిచిన ప్రహరీ..

మినీ స్టేడియం నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీ పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారు. ప్రహరీ స్థల వివాదం నెలకొనడం వల్ల పనులు ముందుకు సాగడం లేవు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పనులను పరిశీలించి స్థల వివాదాన్ని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఆటలకు ఇబ్బందులే..

మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు క్రీడాకారులు సుమారు 5వేల మంది ఉన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా.. సాధన చేయడానికి సరైన సదుపాయాలు, మైదానాలు అం దుబాటులో లేవు. అటవీ, పోలీసు, ఆర్మీ ఉద్యోగా లు సాధించాలనుకునే నిరుద్యోగ యువత సాధన చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం తో పాటు వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, నారాయణపూర్, రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని మైదానాల్లో సాధన చేస్తున్నారు. పలువురు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములు, ఇళ్ల ఎదుట సాధన చేస్తూ లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నారు. మండల స్థాయి క్రీడాపోటీలను మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఉన్న పల్లెప్రకృతి వనంలో అరకొర సౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఉన్నా.. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ స్టేడియం పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, క్రీడాకారులు కోరుతున్నారు.



ఓ పాఠశాల ఖాళీ స్థలంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

కొనసాగుతున్న మినీ స్టేడియం నిర్మాణ పనులు

మైదానం లేక ఆడలేకపోతున్నాం.. : నాగరాజు, విద్యార్థి, ఎల్లారెడ్డిపేట



ఆటలు ఆడాలన్న ఉత్సాహం ఉన్నా మైదానం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో ఆడుకుకోవాల్సి వస్తోంది. మినీ స్టేడియం పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు వస్తే క్రీడల్లో సత్తా చాటుతాం.

ఆటలకు దూరంగా ఉంటున్నాం: రేవతి, విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట



మినీ స్టేడియం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులను పూర్తిచేసి సదుపాయాలను కల్పించాలి. ఆటలు ఆడేం దుకు స్థలం లేకపోవడంతో దూరంగా ఉంటున్నాం. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నా సౌకర్యాలు లేక రాణించలేకపోతున్నాం. అధికారులు పట్టించుకుని పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణకు తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ, వరంగల్ ప్రాజెక్టు సంచాలకుడు భరద్వాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేశ్‌బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ భరద్వాజ్ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని త్వరితగతిన పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నేషనల్ హైవే అథార్టీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫిజీషియన్ల సదస్సును కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో శని,ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఇండియా జిల్లా బాధ్యులు డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ రఘురామన్ తెలిపారు. శుక్రవా రం నగరంలోని ఐఎంఏ హాలులో రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర సదస్సులో వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య విధానం, చికిత్స, పరికరాలు, మందుల పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతీ వైద్యుడు నూతన వైద్య విధానాన్ని నేర్చుకోవాలన్నారు. అందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.చైతన్యరెడ్డి, సంజయ్, జె.సురేష్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, వడ్డెబోయిన లక్ష్మణ్, నవీన, పద్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

వేములవాడ రాజన్నకు భక్తుల నీరాజనాలు



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి భక్తులు నీరాజనాలు పలికారు. శుక్రవారం ఉదయం ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి ఆలయ అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజి గూడకు చెందిన నీలగిరి శంకరరావు కుటుంబ సభ్యులు రూ. లక్షా 11వేల 111 చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అంద జేశారు.

నేడు భీమేశ్వర ఆలయంలో పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధిలో భాగంగా జరిగే మార్పుల దృష్ట్యా భీమేశ్వర ఆలయంలో చేపట్టే దర్శనాలకు పూజలు శనివారం ప్రారంభించనున్నట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ప్రధానార్చకులు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు శ్రీభీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భీమేశ్వర ఆలయంలో స్వామి వారి కైంకర్యములు ప్రారంభించు ప్రదేశములకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

భీమేశ్వర ఆలయానికి ఉత్సవమూర్తుల తరలింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం నుంచి అర్చక పరివారంతో శనివారం ఉదయం 8.30 గంటలకు పల్లకీసేవలో ఉత్సవమూర్తులను శ్రీభీమేశ్వర ఆలయానికి తరలించనున్నట్లు ఈవో తెలిపారు. అనంతరం పూజాకార్యక్రమాలు చేపటన్ననున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ● ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు ప్రతిభచాటారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ గోవింద కృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ వేణుకుమార్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు గుంటపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి బాబు, కోచ్‌లు మధుకర్, నామ రమేష్, వెంకటేష్, ముస్తాక్, గంగరాజు, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, శ్రీనివాస్, రాజు నాయక్, నారాయణ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

● విజేతలు వీరే...

బాలికల విభాగంలో ఎన్.ఇరాన్యశ్రీ, వినూతన, సిరిచందన, అక్షితరెడ్డి, బాలుర విభాగంలో ఎస్.హర్షవర్ధన్, డి.శ్రీచరణ్ విజేతలుగా నిలిచారు. కె.వైభవ్, శ్రీమర్ష, మహ్మద్ రాయల్, శౌర్యతేజ కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఎంపిక

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగం కబడ్డీలో మనిషా, ఖోఖోలో రేవతి, సంజన, వాలీబాల్‌లో దర్శిని, అక్షయ, అక్షిత, అండర్-14 విభాగం కబడ్డీలో యశశ్విని, హారిక, ఖోఖోలో సంజన జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతుల ధర్నా

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ వద్ద రైతుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ధరలు తగ్గించి 1,600 రూపాయలకే కొనుగోలు చేస్తూ రైతులను నట్టేటా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో సన్న బియ్యానికి బోనస్ విడుదల చేయాలని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర 2,420 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధర్నా విరమించాలని మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు రైతులను నచ్చజెప్పినా వినలేదు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన రైతులు, రైతు ఐక్య వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

పందుల నుంచి పంటలు కాపాడండి

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పం టలను ధ్వంసం చేస్తున్న పందుల నుంచి కాపాడాలని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యాల ఎదుట గంగాధర రైతు లు నిరసన చేపట్టారు. గంగాధర గ్రామపరిధిలో పదుల సంఖ్యలో పందులు గుంపులుగా పంటలపై పడి నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు తేడాలేకుండా వరి, కూరగాయలు, ఇతర పంటలను పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంపులుగా వస్తున్న పందులు ఒంటరిగా ఉన్న రైతులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులు కలుగజేసుకుని పందుల నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని గణపతి ఆలయంలో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ద్యావళ్ల కిరణ్, శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్: నగరంలోని 47వ డివిజన్ షాషాబ్ స్ట్రీట్‌లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆ డివిజన్‌కు చెందిన ఖాలీద్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

- నగరంలో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న దాదాపు రూ.8 కోట్ల విలువ చేసే మున్సిపల్ పార్కు స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శేఖర్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

గణేశ్‌నగర్: కరీంనగర్ అశోక్ నగర్‌లోని శక్తిసదన్‌లో వసతి పొందుతున్న వివిధ సమస్యల బాధిత మహిళల కోసం మహిళ ప్రాంగణం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ తరగతులను శుక్రవారం జిల్లా సంక్షేమాధికారి సరస్వతి ప్రారంభించారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూరులో పోషణ మాసంలో భాగంగా శుక్రవారం సభ నిర్వహించారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ ఎకో బజార్ స్వదేశీ దీపావళి పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు బదుకోలు సురేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సిద్దిపేట జడ్పీ వైస్‌ఛైర్మన్ రాజిరెడ్డి, ఎనుమాల తిరుపతిరెడ్డి, మాజీసర్పంచ్‌లు భూమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేశం ఉన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో 108 అంబులెన్స్‌ను ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ శుక్రవారం తనిఖీ చేశారు.

సైదాపూర్: మండలంలోని ఎలబో తారం మాజీసర్పంచ్ మారబోయిన శ్రీనివాస్ అతనిభార్య మాజీఎంపీటీసీ మారబోయిన రాజేశ్వరి బీఆర్ఎస్‌కు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీలో చేరబోమని ఇండిపెండెంట్‌గా కొనసాగుతామన్నారు.

విద్యార్థులకు కళల్లోనూ శిక్షణ ఇవ్వాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు సహ పాఠ్య కార్యక్రమాల్లో భాగంగా కళల్లోనూ శిక్షణ ఇవ్వాలని, కళలతోనే సాంస్కృతిక వికాసం సాధ్యమని డీఈవో శ్రీరాం మొండయ్య అన్నారు. శుక్రవారం కళాభారతిలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 8, 9 తరగతుల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జానపద నృత్య పోటీల్లో మాట్లాడారు. సృజనాత్మక ఆలోచన కళల ద్వారా చేకూరుతుందన్నారు. సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రథమ బహుమతిని టీజీఎంఎస్ రామడుగు పాఠశాల విద్యార్థులు, ద్వితీయ తృతీయ బహుమతులను యూపీఎస్ చెర్లబూత్కూర్, కేజీబీవీ వీణవంక పాఠశాలల విద్యార్థులు గెలుచుకున్నారు. గాజుల రవీందర్, సంగెం రాధాకృష్ణ న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, అనంతాచార్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీరాం మొండయ్య

● సైన్స్‌కు కళను జోడిస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని డీఈవో శ్రీరాం మొండయ్య అన్నారు. శుక్రవారం కళాభారతిలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌ను ప్రారంభించారు. బోధనకు నాటకీకరణ జోడిస్తే బోధనాభ్యసన ప్రక్రియలు సులభతరం అవుతాయన్నారు. ప్రథమ బహుమతి భగత్‌నగర్ అల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు, ద్వితీయ, తృతీయ బహుమతులను కేజీబీవీ తిమ్మాపూర్, మానేరు సెంట్రల్ స్కూల్ విద్యార్థులు గెల్చుకున్నారు. జిల్లా సైన్స్‌అధికారి జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధిస్తాం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సుభాష్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలతో సతమవుతున్న వ్యక్తి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ విప్లవశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలు కోరే సమాచారం అందించడానికి మన దగ్గర ఉన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ అన్నారు. సమాచార హక్కుచట్టం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పురాతన ఆలయాలను సంరక్షించుకోవాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన, పురాతన దేవాలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గంగాధర మండలంలోని వెంకంపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆయన రూ.లక్షా 16 వేల విరాళం అందజేశారు. శుక్రవారం నగరంలోని విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఆలయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆలయ పునర్నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామి ఆలయం మహిమానిత్వమైనదన్నారు. సందవేణి వెంకట్, సహస్ర జూనియర్ కళాశాల అధినేత, ఆలయ కమిటీ ఛైర్మన్ సంకటి శ్రావణ్, పల్మారి సతీష్ యాదవ్, సంపత్ యాదవ్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

భగత్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లి ఇందిరమ్మ కాలనీ నుంచి వెంకటేశ్వర దేవాలయానికి వెళ్లే రోడ్డులో హైమాస్ట్ లైట్లను సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది లక్షల రూపాయల సుడా నిధులతో వేంకటేశ్వర దేవాలయానికి వెళ్లే దారితో పాటు ఆలయంపైన లైట్లు ఏర్పాటు చేశామన్నారు. పంజాల స్వామిగౌడ్, కోడూరి శ్రీనివాస్‌గౌడ్, ఉప్పు తిరుపతి, బత్తిని గణేష్, మునిగాల శ్రీనివాస్, భూపతి, తాండ్ర రాజు, సందీప్ పాల్గొన్నారు.

టికెట్లు ఇచ్చేది బీజేపీ నాయకత్వమే

భగత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టికెట్లు ఇచ్చేది వ్యక్తులు కాదని, బీజేపీ రాష్ట్ర, జిల్లా పార్టీల నిర్ణయం మేరకే బీఫాం అందిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జనతా పార్టీలో వర్గాలు, వర్గాలకు టికెట్లు, బీఫామ్‌లు ఇచ్చే సంప్రదాయం లేదని తెలిపారు. ప్రజలు, పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మాత్రమే గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం నిర్ణయం మేరకు మాత్రమే జిల్లా నాయకత్వం బీఫాం ఇస్తుందని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొడుదాం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లు ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ కుట్రలను తిప్పికొడుదామని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ముందుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో బురుదజల్లే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టేందుకు శనివారం ఉదయం అంబేద్కర్‌నగర్ (ఆదర్శనగర్ బోర్డు ఎదుట) అంబేద్కర్ విగ్రహం నుంచి బీఆర్ఎస్ పాలనలో అవినీతిమయం పాలన కార్డులు, కాంగ్రెస్ ప్రజా పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాల కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాత, పద్మశ్రీ, స్వర్గీయ శ్రీభాష్యం విజయసారథి ఆశీస్సులతో సాయంత్రం పుణ్యాహవాచనం, వాస్తు హోమం, సేనాధిపతి ఉత్సవం, మృత్తికా సంగ్రహణం, అంకురార్పణ, ధ్వజపట శయనాధివాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ పాల్గొన్నారు.



ప్రదక్షిణ చేస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాల్లో సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంజనాద్రి లక్ష్మీగణపతి, అయ్యప్ప, గిద్దెపెరుమాండ్లు, రామేశ్వర, వాసవికన్యకాపరమేశ్వరి, వరసిద్ధి వినాయకస్వామి, గౌరీశంకర ఆలయాల్లో పూజలు చేశారు. మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు.



మహాశక్తి ఆలయంలో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న వొడితెల ప్రణవ్

వీణవంక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మల్లన్నపల్లి, ఘన్ముక్ల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, గెల్లు శ్రీనివాస్, కొమ్మిడి రాకేష్ రెడ్డి, తదితరులున్నారు.

ఇల్లందకుంట: మండలంలోని లక్ష్మాజీపల్లె, కనగర్తి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను వొడితెల ప్రణవ్ శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్, నాయకులు అరుకాల వీరేశలింగం, రమేష్, సదానందం, అన్నం ప్రవీణ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లో రూ.20లక్షలతో నిర్మిస్తున్న హెల్త్‌సెంటర్‌ని శుక్రవారం వొడితెల ప్రణవ్ పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైనవైద్యాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

మళ్లీ మీ ఆశీర్వాదం కోసం వస్తా..

వీణవంక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల ప్రజల ఆశీర్వాదం కోసం మళ్లీ వస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండలకేంద్రంతోపాటు కోర్కల్, మాల్లారెడ్డిపల్లి, ఎల్బాక, గంగారం గ్రామల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కోర్కల్, మాల్లారెడ్డిపల్లి గ్రామ ఆలయాల్లో పూజలు చేశారు. ఈటల పర్యటనకు బండి సంజయ్ వర్గం నాయకులు దూరంగా ఉండడం చర్చగా మారింది. నాయకులు పెద్ది మాల్లారెడ్డి, మారముళ్ల కొంరయ్య, దాసారపు రాజు, వెంకటేశ్, ఎనగంటి శ్రీనివాస్, తదితరులున్నారు.

పే కమిషన్ ఏర్పాటు చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎనిమిదో పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ పోస్టల్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని తపాల కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి మాట్లాడుతూ ఎనిమిదో పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పాత పెన్షనర్లకు నష్టం కలిగించే వాలిడేషన్ బిల్లును రద్దు చేయాలని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేషం, సెక్రెటరీ చంద్రమోహన్, నాయకులు చంద్రమౌళి, ఆదిరెడ్డి, నర్సింగరావు, రాజయ్య, ప్రభాకర్, హనీఫ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్‌ల అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం, చలికాలం నేపథ్యంలో విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని 300 మంది హోంగార్డ్స్‌కు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం రెయిన్‌కోట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అవసరమైనప్పుడు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీంరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రజనీకాంత్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకం కేంద్రం సందర్శన



పరిశీలిస్తున్న శస్త్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మల్బరీ ఆకులు, మొక్కల పెంపకం, తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యా ర్థులకు వివరించారు. అనంతరం కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ క్షేత్రపర్యటనల వల్ల విద్యార్థులకు శాస్త్రీయజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కరాటేకు సెయింట్ జార్జ్ విద్యార్థులు

భగత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): సెయింట్ జార్జ్ విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీ లకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో అండర్-14 విభాగంలో కృషిత్, ప్రమోద్, మణికుమార్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 12న గోదావరిఖనిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కరాటే కోచ్ వేణుగోపాల్‌ను అభినందించారు.



అభినందిస్తున్న ఛైర్మన్ ఫాతిమారెడ్డి

బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

గణేశ్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలపై కపట ప్రేమ కనబరుస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని గీత భవన్ చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవరిస్తోందన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

భగత్‌నగర్: కాంగ్రెస్ బీసీలను మరోసారి మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని చెల్లని జీవో తీసుకొచ్చిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన పరిణామలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.

దిద్దుబాటు చర్యలు చేపట్టాలి

కరీంనగర్ టౌన్: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు పొలాడి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

సీఎం రాజీనామా చేయాలి

గణేశ్‌నగర్: బీసీలను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

కాంగ్రెస్ మోసం తేటతెల్లమయింది

చొప్పదండి: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం తేటతెల్లమయిందని బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో కాకుండా ఇష్టం వచ్చినట్లుగా వివరించడం వల్లే హైకోర్టు స్టే ఇచ్చిందని ఈ తీర్పునకు కాంగ్రెస్ సర్కారే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు, రూరల్ ఏడీఈలు, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరుమలనగర్, హనుమాన్ నగర్, గిద్దెపెరుమాండ్లు, గౌతమినగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, భవానీనగర్, మహాలక్ష్మి నగర్, అల్కాపురి, వివేకానందనగర్, నగర్‌నగర్, మెయిన్ రోడ్ కోతిరాంపూర్, గణేష్‌నగర్, ఎంఎల్‌సీ, గణేష్ నగర్ బైపాస్, కమాన్ మెయిన్ రోడ్, దోబీఘాట్, దుర్గాదేవినగర్, ఉజ్వాలాపార్క్, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు సిరిపురం కాలనీ, రాజీవ్ చమన్, సిటిజన్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, కృష్ణనగర్ కాలనీ, ఆటోనగర్, ధర్మనగర్, బైపాస్ రోడ్డు, బొమ్మకల్, గుంటూరుపల్లి, దుర్షెడ్, గోపాల్‌పూర్, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఇరుకుల్ల, మగ్దుంపూర్, చెర్లబూత్కూర్, తాహెర్ కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట్, దుబ్బపల్లి, చేగుర్తి, నల్లగుంటపల్లి, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు నగునూర్, వల్లంపహాడ్, తీగలగుట్టపల్లిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4:30 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టు, మొలంగూర్ సబ్ స్టేషన్ల పరిధిలో రెండో శనివారం నెలవారి మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రఘు తెలిపారు. కొత్తగట్టు సబ్‌స్టేషన్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, మొలంగూర్ సబ్‌స్టేషన్‌లో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5 వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మొలంగూర్, ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకాయపల్లి, గుడాటిపల్లి, కొత్తగట్టు, లింగాపూర్, గొల్లపల్లి ప్రజలు సహకరించాలని కోరారు.

మార్నింగ్ వాక్ ఇన్ విలేజ్

వీణవంక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్‌లో మార్నింగ్ వాక్ ఇన్ విలేజ్ కార్యక్రమాన్ని జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ శుక్రవారం చేపట్టారు. ప్రజలకు సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు లక్ష రూపాయలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

(5వ పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, సీడీ పీవో సబిత, మెప్మా పీడీ స్వరూపరాణి, వైద్యాధికారి సనా, ఎన్జీవో ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ఇచ్చి ఖాతాలను కొనసాగించవచ్చు

కరీంనగర్ టౌన్ : ఎవరైనా పదేళ్లు, ఆపై కాలం బ్యాంకు ఖాతాల్లో నగదు మొత్తం ఉంచి మరిచిపోయిన వారు బ్యాంకుకు వచ్చి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సు కాపీ ఇచ్చి వారి ఖాతాలను మళ్లీ కొనసాగించుకోవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుగూల్‌లో ఉద్గం పోర్టల్ రిజిస్టర్ అయి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఖాతాదారుల గుర్తింపుతో ఖాతాల నిర్వహణకు మద్దతు ఇవ్వాలని అన్ని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఏవో సుధాకర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అల్ఫోర్స్‌లో అవగాహన

రామడుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెదిరలోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మత్తు పదార్థాలపై ఎస్ఐ రాజు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇంచార్జి ఎస్ఐ సురేందర్, షీటీం స్వప్న, ఎక్సైజ్ పోలీసులు అవగాహన కల్పించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు.

అల్ఫోర్స్‌లో జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

భగత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభచాటిన విద్యార్థులకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోనల్ స్థాయి ఎంపికపోటీలు ఉంటాయన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసమావేశానికి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు హాజర య్యారు. శుక్రవారం మెదక్‌జిల్లాలోని ఏడుపాయలలో సమావేశం నిర్వహిం చారు. పలుఅంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు కాళీచరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్టే పాపం బీజేపీ, బీఆర్ఎస్‌దే

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీరిజర్వేషన్లపై స్టే పాపం బీజేపీ, బీఆర్ఎస్‌దేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన జీవో 9పై తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడంపై స్పందిస్తూ శుక్రవారం జిల్లాకాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీసెల్ ఛైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఎప్పుడు అంశాన్ని లేవనెత్తినా కోర్టువేదికగా బీజేపీ అడ్డుకుంటోందన్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురం రాజేశం, నాయకులు రామిడి రాజిరెడ్డి, కామ్‌రెడ్డి రాంరెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, కంకణాల అనిల్ కుమార్, సాయిని తిరుపతి, వంగల విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆర్‌టీఐ ద్వారా ప్రతీ పౌరుడు సమాచారం పొందవచ్చు

సుభాష్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఐ ద్వారా ప్రతీ పౌరుడు సమాచారం పొందే హక్కు ఉందని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారంనగరంలోని ఫిల్మ్‌భవన్‌లో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ కాంపెన్ ఆధ్వర్యంలో సమాచారహక్కు చట్టం 20సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉద్యకారులు, దరఖాస్తు దారులతో సదస్సును నిర్వహించారు. జిల్లా కన్వీనర్ గుడూరి స్వామిరెడ్డి, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ నరేందర్, రూరల్ తహసీల్దార్ రాజేష్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

చిగురుమామిడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్‌లను బీసీలకు అందించాలని కోరుతూ శుక్రవారం బీఆర్ ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు హన్మండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పెనుకుల తిరు పతి, సన్నీల్ల వెంకటేశం, కృష్ణమాచారి, చంద్రం, తిరుపతి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో కరీంనగర్ జిల్లా 11వమహాసభలు నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో కార్మికుల హక్కుల కోసం యూనియన్ పోరాడుతోందన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఏడు నెలలకు నగరంలోని ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయహుండీలను శుక్రవారం లెక్కించారు. రూ.1,06,015 ఆదాయం, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయాలకు రూ.3,41,776 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

గణేశ్‌నగర్,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీవెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాలలో చదివిన వంగల అమూల్య సిద్దిపేట కళాశాలలో ఎంబీబీఎస్‌లో సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం అమూల్యను కళా శాల ఛైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి సన్మానించారు.

జిల్లా అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన నగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న చీపిరిశెట్టి కవిత డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణ కథ-రైతు జీవనచిత్రణ అనేఅంశంపై పరిశోధనకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యా లయం ఇటీవల నిర్వహించిన 25వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ తెలుగుశాఖ ప్రొఫెసర్ బాణాల భుజంగరెడ్డి పర్యవేక్ష ణలో కవిత పరిశోధన చేశారు.

ఆదర్శపాఠశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలి

భగత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని పోచంపల్లి ఆదర్శపాఠశాల విద్యార్థులకు ప్రత్యేకబస్సులను ఏర్పాటు చేయా లని ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్టీసీ కరీంనగర్-1 డిపో కార్యాలయం ఎదుట ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.

దుర్గాదేవి ఆలయంలో పూజలు

కరీంనగర్ రూరల్,అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ పరివార సమేత దుర్గా భవానీ ఆలయంలో కృతిక నక్షత్రం సందర్భంగా శుక్రవారం పూజలు చేశారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు ఇచ్చారు.

కుడా ఛైర్మన్‌ను కలిసిన ఇల్లందకుంట ఆలయ ఛైర్మన్

ఇల్లందకుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి ఆలయఛైర్మన్ ఇంగిలే రామారావు శుక్రవారం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ ఇనుగాల వెంకటరాం రెడ్డిని హనుమకొండలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

మెట్‌పల్లిలో పోషణ్ అభియాన్

శంకరపట్నం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లిలోని అంగన్‌వాడీ సబ్‌సెంటర్‌లో శుక్రవారం పోషణ్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు పోషకా హారం ప్రాముఖ్యతను వివరించారు.

దీపావళి టపాసుల యూనియన్ కార్యవర్గం

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో దీపావళి టపాసుల యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం హైస్కూల్ మైదానంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జమాల్‌పూర్ అనిల్, ఉపాధ్యక్షుడిగా అయితే కిశోర్, ప్రధానకార్యదర్శిగా బుర్ర కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు.